

మన భానుపుర

ఇది సూర్యాపేట వార్తల ఉషాకిరణం

మంగళవారం 3 నవంబర్ 2026 | ఎడిటర్ :- బచ్చు పురుషోత్తం | పేజీలు :- 2



హైదరాబాద్‌ను క్లీన్, ట్రాఫిక్ ఫ్రీ సిటీగా మార్చాలి

భానుపురి/హైదరాబాద్

హైదరాబాద్ మహానగరాన్ని క్లీన్ సిటీగా, ట్రాఫిక్ ఫ్రీ సిటీగా తీర్చిదిద్దాలని సీఎం రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఇవాళ జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో మున్సిపల్ అధికారులతో వివిధ అంశాలపై సీఎం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నగరంలో ఎక్కడా చెత్త కనిపించ కూడదని, చెత్త సేకరణపై నిరంతర పర్య వేక్షణ ఉండాలని అధికారులకు సూచించారు. ప్రతిరోజూ ఇంటింటికీ చెత్త సేకరణ జరిగేలా అవ సరమైన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ విషయంలో నిర్లక్ష్యం వహించిన వారిపై కఠిన చర్యలు తీసుకో వాలని స్పష్టం చేశారు. నిర్మాణ వ్యర్థాల తరలింపునకు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని పేర్కొన్నారు. మున్సిపల్ పరిధి లోని వివిధ ఇండస్ట్రియల్ ఏరియాల్లో చెత్త సేకరణకు ఐలా అధికారులతో సమన్వయం చేసుకోవాలని సీఎం రేవంత్ రెడ్డి సూచించారు.

గ్రీన్ ట్యాంకర్ల'పై ప్రజలకు అవగాహన కల్పించండి.

నగరంలో నిర్మాణ పనులు, పార్కుల నిర్వహణ, ల్యాండ్‌స్కేపింగ్, గార్డెనింగ్‌తో పాటు ఇతర అవస



రాలకు ఎస్టీపీ ల్లో శుద్ధి చేసిన నీటిని సరఫరా చేసే ఉద్దేశంతో 'గ్రీన్ ట్యాంకర్ల'ను సద్వినియోగం చేసు కునేలా ప్రజల్లో అవగాహన కల్పించాలని సీఎం అధికారులను ఆదేశించారు. నిర్మాణ రంగం, గ్రీనరీ మెయింటెనెన్స్, పార్కుల అభివృద్ధి వంటి వాటికి ప్రస్తుతం తాగునీటిని ఉపయోగిస్తున్నారని, దానికి బదులుగా ఎస్టీపీల్లో శుద్ధి చేసిన నీటిని వినియో గించడం ద్వారా తాగునీటిని ఆదా చేయవచ్చని సీఎం అభిప్రాయపడ్డారు. ఇందుకోసం జలమండలి తొలి విడతలో 19 మురుగునీటి శుద్ధి కేంద్రాల నుంచి 28 గ్రీన్ వాటర్ ట్యాంకర్ల ద్వారా సేవలను అందుబాటు లోకి తెచ్చినట్లు గుర్తుచేశారు. జీహెచ్ఎంసీతో పాటు జీహెచ్ఎంసీ పరిధికి ఆనుకుని ఉన్న ఇతర మున్సి పాలిటీల్లోనూ గ్రీన్ వాటర్ సరఫరాను మరింత విస్త రించాలని సూచించారు.

ఎలివేటెడ్ కారిడార్ల నిర్మాణానికి ప్లాన్ చేయండి..

నగరంలో ట్రాఫిక్ కష్టాలకు చెక్ పెట్టి, హైదరాబాద్‌ను ట్రాఫిక్ ఫ్రీ సిటీగా మార్చేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సీఎం ఆదేశిం చారు. ముఖ్యంగా ట్రాఫిక్ క్రమబద్ధీకరణపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. సిగ్నల్ ఫ్రీ వ్యవస్థను తీసుకు రావడానికి అవసరమైన చోట అండర్‌పాస్‌లు, ఎలివేటెడ్ కారిడార్‌లను నిర్మించేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. సాధ్యమైనంత వరకు సిగ్నళ్ల వద్ద వాహనాలు నిలిచిపోకుండా నిరంతరా యంగా రాకపోకలు సాగేలా చూడాలన్నారు. ఈ సమీక్షా సమావేశంలో ఎంపీ వేం నరేందర్ రెడ్డి, సీఎం కార్యదర్శి మాణిక్ రాజ్, హెచ్ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్, శంషాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ సృజన, తదితరులు పాల్గొన్నారు.



ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి

భానుపురి/సూర్యాపేట కలెక్టరేట్

ప్రజల సమస్యల పరిష్కారమే వేదికగా సాగుతున్న ప్రజావాణి కార్యక్రమానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అధికారులను ఆదేశించారు. సోమవారం సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి అనంతరం జిల్లా అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ప్రతి సోమ వారం జరుగు ప్రజావాణి కి జిల్లా స్థాయి అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలని, ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా మరియు మండల స్థాయి ప్రజావాణి దరఖాస్తులను తప్పనిసరిగా ఆన్‌లైన్ పోర్టల్‌లో నమో దు చేయాలని స్పష్టం చేశారు. ప్రజావాణి పోర్టల్‌లో ఇంకా పరిష్కారం కాకుండా ఉన్న దరఖా స్తులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని కలెక్టర్ ఆదే శించారు. కొత్తగా అందుతున్న దరఖాస్తులను ఎప్పటికప్పుడు పోర్టల్‌లో నమోదు చేయాలని సూచిం చారు. ముఖ్యంగా రాష్ట్ర ప్రజావాణిలో పెండిం గ్‌లో ఉన్న దరఖాస్తులను తక్షణమే పరిష్కరించేలా సంబంధిత శాఖల అధికారులు ప్రత్యేక చొరవ చూపాలని తెలిపారు. ప్రతి అధికారి తమ లాగిన్ లో ఉన్న పెండింగ్ దరఖాస్తులను వెంటనే పరిష్కరిం చాలని లేనియెడల వారిపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని, ప్రజలు పెట్టుకున్న అర్జీలను పెండిం గ్‌లో ఉంచకుండా, నిర్ణీత గడువులోగా వాటిని పరిష్క రించేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. మండల స్థాయిలో ప్రారంభమైన ప్రజావాణి కి అన్ని శాఖల మండల స్థాయి అధికారులు తప్పనిసరిగా హాజర య్యేలా జిల్లా అధికారులు పర్యవేక్షించాలని ఆదేశిం చారు. మండల స్థాయి సమస్యలు స్థానికంగానే పరిష్కారమైతే ప్రజలకు ఇబ్బందులు తప్పుతాయని ఆయన పేర్కొన్నారు. సోమవారం నిర్వహించిన ప్రజా వాణి కార్యక్రమం లో భూ సమస్యలకి, రెవిన్యూ కి సంబందించి 50 దరఖాస్తులు, డిపిఓ 6, పి డి హౌజింగ్ 6, డి డబ్ల్యు ఓ 5, డిఇఓ 5, మిగిలిన 32 దరఖాస్తులు వివిధ శాఖలకి చెందినవని, మొత్తం



104 దరఖాస్తులు వచ్చాయాని వాటిని పరిష్కరిం చేందుకు శాఖల వారీగా పంపించటం జరిగిందని కలెక్టర్ ఈ సందర్భంగా అన్నారు. ఈ కార్యక్రమానికి అదనపు కలెక్టర్ బి. హరి సింగ్, డిఆర్ఓ ప్రేమ్ రాజ్, జడ్పీ సీఈవో శిరీష, డిఆర్డిఓ పిడి సన్యాసయ్య, డీఈవో శ్రీనివాస్, డీఎస్ఓ మోహన్ బాబు, డిడబ్ల్యుఓ నరసింహారావు, డిఎంహెచ్వో వెంకటరమణ, సిపిఓ కిషన్, సిఎఫ్ఓ దామోదర్ రెడ్డి, శ్రీనివాసరావు, డిఐఈఓ సులోచన రాణి, ఎస్సీ కార్పొరేషన్ ఈడి ఉపేందర్, మున్సిపల్ కమిషనర్ హనుమంత్ రెడ్డి , జిల్లా అధికారులు తదితరులు హాజరైనారు.

ఎస్ఐ, కానిస్టేబుల్ ఉచిత శిక్షణ అభ్యర్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ

భానుపురి/సూర్యాపేట ప్రతినిధి

ఎస్ఐ, కానిస్టేబుల్ ఉద్యోగాలకు సిద్ధమవుతున్న నిరుద్యోగ యువతకు జిల్లా యంత్రాంగం, జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత శిక్షణ కార్యక్రమంలో భాగంగా పాత ఎస్పీ కార్యాలయంలో శిక్షణ పొందుతున్న అభ్యర్థులకు జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్, జిల్లా ఎస్పీ నరసింహ అధికారుల సమక్షంలో స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. నేటి సమాజంలో ప్రభుత్వ ఉద్యోగాలు సాధించాలంటే తీవ్ర పోటీని ఎదుర్కోవాల్సి ఉంటుందని, ఆ పోటీని తట్టుకుని ఉద్యోగం సాధించాలంటే విషయ పరి జ్ఞానంతో పాటు మానసికంగా కూడా సిద్ధం కావాలని అన్నారు. జిల్లా ఎస్పీ ప్రత్యేక ప్రణాళికతో, రాష్ట్ర మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సహకారంతో పెద్ద ఎత్తున నాణ్యమైన ఉచిత శిక్షణ అందిస్తున్నట్లు తెలిపారు. ఈ శిక్షణలో భాగంగా మొత్తం 400 మంది అభ్యర్థులకు ఉచిత శిక్షణ, వసతి సౌకర్యం కల్పిస్తున్నామని, సూర్యాపేటలో 200 మందికి, కోదాడలో 200 మందికి శిక్షణ అందిస్తున్నామని వివరించారు. నిపుణులైన అధ్యాపకులు, ఫిజికల్ ఈవెంట్స్ శిక్షకుల ఆధ్వర్యంలో శిక్షణ కొనసాగు తోందన్నారు. ప్రతి సబ్జెక్టును కనీసం మూడుసార్లు చదివి రివిజన్ చేయాలని సూచించారు. పోటీ పరీక్షల సమయంలో ఒత్తిడికి గురికాకుండా ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని, ఒత్తిడి వల్ల నేర్చుకున్న విష యాలను కూడా మర్చిపోయే అవకాశం ఉంటుందని తెలిపారు. సమాజంలో ఎన్నో ప్రశ్నలు, సవాళ్లు ఎదుర వుతుంటాయని, వాటన్నింటికీ ఉద్యోగం సాధించడమే సమాధానం కావాలని, లక్ష్యాన్ని నిర్దేశించుకుని క్రమశిక్షణతో నిరంతర కృషి చేయాలని యువతకు

పిలుపునిచ్చారు. జిల్లా ఎస్పీ నరసింహ మాట్లాడుతూ.. ప్రస్తుత కాలంలో పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే యువతకు అన్ని రకాల సదుపాయాలు, అవకాశాలు అందుబాటులో ఉన్నాయని, వాటిని సద్వినియోగం చేసుకుంటూ పట్టుదలతో చదివి ప్రభుత్వ ఉద్యోగాలు సాధించాలని, తల్లిదండ్రులకు, కుటుంబానికి అండగా ఉండాలని సూచించారు. శిక్షణ కోసం నిర్వహించిన ఎంపిక పరీక్షకు సుమారు 1,400 మంది అభ్యర్థులు హాజరుకాగా, వారిలో ప్రతిభ ఆధారంగా 400 మందిని ఎంపిక చేసినట్లు వెల్లడించారు. ఉద్యోగం సాధించాలనే తపన ప్రతి ఒక్కరిలో ఉండాలని, సమయాన్ని వృథా చేయకుండా ప్రణాళికాబద్ధంగా చదువుతూ ఏకాగ్రతతో లక్ష్యం వైపు ముందుకు సాగాలని సూచించారు. అభ్యర్థులకు నాణ్యమైన స్టడీ మెటీరియల్ అందిస్తున్నామని, అధ్యాపకులు బోధించే ప్రతి అంశాన్ని నోట్ చేసుకోవాలని, ప్రతి సబ్జెక్టును పరీక్ష సమయం వచ్చేలోపు కనీసం మూడుసార్లు పునశ్చరణ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమం లో శిక్షణ డిప్యూటీ కలక్టర్ లు అనూష, రవితేజ, సూర్యాపేట డివిజన్ డీఎస్పీ ప్రసన్నకుమార్, ఆర్మ్డ్ డీఎస్పీ నరసింహ చారి, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ రామారావు, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు ప్రవీణ్ కుమార్, జానయ్య, ఆర్ఎస్ఐలు సురేష్, సాయిరాం, అధ్యాపక బృందం, పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజా ఫిర్యాదులపై వేగంగా పోలీస్ సేవలు



భానుపురి/సూర్యాపేట ఎస్పీ కార్యాలయం

సూర్యాపేట జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం పోలీసు ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి వివిధ సమస్యలపై వచ్చిన ఫిర్యాదుదారులతో జిల్లా ఎస్పీ నరసింహ స్వయంగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకుని, వినతులను పరిశీలించారు. ప్రజలు అందించే ఫిర్యాదులపై పోలీసులు తక్షణమే స్పందించి, సమస్యలను త్వరితగతిన పరిష్కరించి బాధితులకు భరోసా కల్పించాలని సంబంధిత పోలీసు అధికారులను ఎస్పీ ఆదేశించారు. ప్రజలకు అవసరమైన సేవలు, తక్షణ సమస్యల పరిష్కారం కోసం పోలీస్ శాఖ నిరంతరం పనిచేస్తుందని తెలిపారు. ప్రజా రక్షణ కోసం పోలీసు సిబ్బంది అనుక్షణం విధులు నిర్వర్తిస్తున్నారని ఎస్పీ పేర్కొన్నారు. ప్రజలు గొడవలు, తగాదాలకు దూరంగా ఉండాలని, సమస్యలు వచ్చినప్పుడు దాడులకు పాల్పడకుండా ఇరు వర్గాలు పెద్దల సమక్షంలో సామరస్యపూర్వకంగా, చట్ట పరిధిలో సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు. ప్రజల సమస్యలను పరిష్కరించడంలో పోలీస్ శాఖ ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటుందని తెలిపారు.



ప్రభుత్వం నిర్దేశించిన ధరలకే బియ్యం విక్రయించాలి



భానుపురి/సూర్యాపేట కలెక్టరేట్

జిల్లాలో బియ్యం విక్రయాలు ప్రభుత్వం నిర్దేశించిన ధరల ప్రకారమే జరగాలని, ప్రభుత్వం నిర్ణయించిన ధరలకు మించి బియ్యం విక్రయించే వ్యాపారులపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ స్పష్టం చేశారు. సోమవారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో సూర్యాపేట, హుజూర్‌నగర్, కోదాడ రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ప్రతినిధులు మరియు సూర్యాపేట జిల్లా హోల్‌సేల్ రైస్ డీలర్లతో జిల్లా కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో బియ్యం ధరలను నియంత్రిస్తూ వినియోగదారులకు సరసమైన ధరలకు బియ్యం అందుబాటులో ఉండేలా రైస్ మిల్లర్లు, హోల్‌సేల్ డీలర్లు సహకరించాలని సూచించారు. ప్రభుత్వం నిర్దేశించిన ధరల కంటే అధిక ధరలకు బియ్యం విక్రయించడం వంటి చర్యలకు పాల్పడితే సంబంధిత వ్యాపారులపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అదేవిధంగా, ప్రభుత్వం నిర్దేశించిన బియ్యం ధరల పట్టికను అన్ని బియ్యం విక్రయ కేంద్రాలలో ప్రజలకు స్పష్టంగా కనిపించే విధంగా ప్రదర్శించాలని ఆదేశించారు. ధరల విషయంలో పారదర్శకత పాటిస్తూ, వినియోగదారుల ప్రయోజనాలను పరిరక్షించేందుకు వ్యాపారులు బాధ్యతా యుతంగా వ్యవహరించాలని తెలిపారు. ఈ సమావేశంలో పాల్గొన్న రైస్ మిల్లర్లు, హోల్‌సేల్ రైస్ డీలర్లు ప్రభుత్వం నిర్దేశించిన ధరల ప్రకారమే బియ్యం విక్రయిస్తామని, ప్రభుత్వం నిర్దేశించిన ధరల పట్టికను తమ దుకాణాలలో తప్పనిసరిగా ప్రదర్శిస్తామని జిల్లా కలెక్టర్‌కు హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో అడిషనల్ కలెక్టర్ బి. హరి సింగ్, డీఎస్ఓ మోహన్ బాబు, జిల్లా మేనేజర్, సివిల్ సప్లైస్ శ్రీధర్ రెడ్డి, సిబ్బంది, జిల్లాలోని రైస్ మిల్లర్లు, హోల్‌సేల్ రైస్ డీలర్లు తదితరులు పాల్గొన్నారు.

ఓటు - భవిష్యత్తు బంగారు బాట

భానుపురి

ఓటుకు నోటు చెల్లు.. నోటా ఎవరికి మేలు?
పేదవాడి ఆశలే ఇక్కడ రాజకీయ బలిపీఠాలు!

కుర్చీల కాంక్షతో విసిరే కాసుల గాలం..
పాలకులు కాబోయే కలెక్షన్ కింగుల జాలం!

చివరి నాలుగు రోజులు ప్రచారాల హోరు హోరు..
పదవిని కైవసం చేసుకునే విశ్లేషకుల తంత్రాల జోరు!

రాజకీయ కుట్రలకు అట్టడుగున నలుగుతున్నది సమాజం..
పైకి పారదర్శకంగా కనిపించే.. చాప కింద నీరులాంటి రాజకీయం!

సంస్కరణలు వచ్చాయి, సోషల్ మీడియాలు గర్జించాయి..
ఎన్ని మారినా.. 'ఎవరి పని వారిదే' అన్నట్టు సాగుతున్నాయి!

ప్రశ్నలకే పరిమితమైన పేదవాడి సంక్షేమ పథకాలు..
స్కాములు చేయడంలో ఘనాపాఠులైన పాలకులు!

తరాలు మారాయి.. కానీ ఓటర్ల తీరు మారలేదు..
కానికి కొరగాని వారే నాయకులు.. పట్టభద్రులే వారి కూలీలు!

ఇన్ని రకాల రాజకీయ క్రీడల చివరి లక్ష్యం ఒక్కటే..
ప్రతిసారీ పేదవాడి నెత్తిపైనే భారాలు మోపడమే!

ఇకనైనా మేల్కోవాలి..
ఓట్ల కోసం మాత్రమే కష్టపడే వాడిని కాదు..
నిరంతరం ఓటర్ల కోసం తపించేవాడిని ఎంచుకోవాలి!

ఎందుకంటే..
నీ వొనికే ఓటు చైతన్యమే.. మన రేపటి బంగారు బాట!

విరచితం:
ఆరిశెట్టి రేవతి గుప్తా
పార్వతీపురం మన్యం జిల్లా

ఇందిరమ్మ ఇళ్లి లబ్ధిదారులకు ప్రొసీడింగ్ పత్రాలు అందజేత



భానుపురి/సూర్యాపేట టౌన్

సూర్యాపేట మున్సిపాలిటీ పరిధిలోని 44వ వార్డులో ఇందిరమ్మ ఇంటి నిర్మాణం కోసం ఎంపికైన లబ్ధిదారులు మద్దెబోయిన గంగోత్రి, కటికం రాణిలకు ప్రొసీడింగ్ ఫారాలను మున్సిపల్ చైర్ పర్సన్ నివేదిత లక్ష్యాధితో కలిసి 44వ వార్డు కౌన్సిలర్ గునగంటి హేమ సతీష్ లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం పేదల సొంతింటి కలను నెరవేర్చేందుకు ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తోందని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇళ్లు మంజూరయ్యేలా కృషి చేస్తామని తెలిపారు. లబ్ధిదారులు త్వరితగతిన ఇంటి నిర్మాణాలు ప్రారంభించి పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వార్డ్ ఆఫీసర్ వార్డు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

పాటల పోటీలో బిల్ కలెక్టర్ ప్రథమ స్థానం



భానుపురి /సూర్యాపేట

ఉభయ తెలుగు రాష్ట్రాల రాష్ట్ర స్థాయి పాటల పోటీలు ఖమ్మంలో ఘనంగా జరిగాయి. ఈ పోటీలలో సూర్యాపేట మున్సిపాలిటీ బిల్ కలెక్టర్ జి. ఉపేంద్రాచారి(జూనియర్ బాలు) ప్రథమ స్థానం సాధించి జిల్లా ఖ్యాతిని ఇనుమడింప చేశారు. ఎంతోమంది గాయకులు పోటీపడిన ఈ రాష్ట్ర స్థాయి పోటీలో ఉపేంద్రాచారి తన గాత్రంతో అందరినీ ఆకట్టుకుని విజేతగా నిలిచారు. మున్సిపల్ విధుల్లోనే కాకుండా సంగీత రంగంలోనూ తన ప్రతిభను చాటిన ఉపేంద్రాచారిని పలువురు అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనకు సంగీతంలో సుశిక్షనిచ్చిన తన గురువు రాచర్ల అనిల్ కుమార్ గారికి ప్రత్యేకమైన ధన్యవాదాలు తెలియజేస్తున్నానని అన్నారు. గురువు ఆశీర్వాదం, ప్రోత్సాహంతోనే ఈ విజయం సాధ్యమైందని తెలిపారు. ఉపేంద్రాచారి విజయం పట్ల మున్సిపల్ సిబ్బంది, కౌన్సిలర్లు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు.



"దయలేని దానా...దయలేని వానా"..

భానుపురి

దయలేని వాన
తడిపింది నాలోని భావాలని...
తడిసిన భావం అక్షరమై మొలకెత్తినది,
కవితా వృక్షమై...!!
చినుకులన్నీ చింతలై రాలితే,
చిగురులన్నీ జ్ఞాపకాలై పూశాయి...
తడిసిన నేల పరిమళమై,
తడిసిన మనసు పదమై మారింది...!!
గాలి తాకితే గీతమై,
కాలం కదిలితే కథమై,
నిశ్శబ్దం పలికితే నాదమై,
నా కలం కదిలితే కవితమై...!!
వాన ఆగిపోయినా...
వదలలేదు ఆ భావాల జల్లు,
అక్షరాలు ఆగలేదు...
కవితా వృక్షం చిగురించడం మానలేదు...!!

--- గోపాల్ ఉప్పల (కలంధార్)

65వ జాతీయ రహదారిపై ఘోర రోడ్డు ప్రమాదం





-ఇద్దరు మృతి మరొకరికి తీవ్ర గాయాలు

కట్టంగూర్, నవంబర్ 2,: హైదరాబాద్ – విజయవాడ 65 నెంబర్ జాతీయ రహదారిపై నల్లగొండ జిల్లా కట్టంగూరు మండలం చెరువు అన్నారం క్రాస్ రోడ్ వద్ద సోమవారం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఇద్దరు అక్కడికక్కడే దుర్మరణం చెందగా మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ప్రమాదానికి సంబంధించి పోలీసులు, క్షతగాత్రుడు ప్రశాంత్ తెలిపిన వివరాల ప్రకారం.. పల్నాడు జిల్లా సత్తెనపల్లి మండలం లక్కరాజు గార్లపాడు గ్రామానికి చెందిన జొన్నలగడ్డ వాసు(22), అతనికి సోదరుడు వరస అయ్యే జొన్నలగడ్డ ప్రశాంత్ లు గత కొంత కాలంగా హైదరాబాదులో సెంట్రింగ్ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. వీరు తమ స్వగ్రామానికి వెళ్లేం దుకు సోమవారం హైదరాబాదు నుండి ద్విచక్ర వాహనంపై బయలుదేరారు. మార్గమధ్యలో నార్కెట పల్లి వద్ద హైవేపై నకిరేకల్ మండలం నోముల గ్రామానికి చెందిన గోగుల స్వాతి (30) వీరు వెళ్తున్న ద్విచక్ర వాహనాన్ని ఆపి తనకు నకిరేకల్ వరకు లిఫ్ట్ చేయాల్సిందిగా కోరగా ముగ్గురు కలిసి నకిరేకల్ వైపు వెళ్తుండగా మండల పరిధిలోని చెరువు అన్నారం క్రాస్‌రోడ్ వద్ద వీరు ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహ నాన్ని ఓవర్‌టేక్ చేసే క్రమంలో వెనకనుంచి వస్తున్న గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టి పైనుంచి వెళ్లడంతో జొన్నలగడ్డ వాసు, గోగుల స్వాతిలు ప్రమాద స్థలం లోనే అక్కడికక్కడే దుర్మరణం పాలయ్యారు. వీరి పైనుండి వాహనం వెళ్లడంతో మృతదేహాలు చిం‌ద్రం గా మారి ప్రమాద స్థలం బితావాహంగా మారింది. ఇరువురి మృతదేహాలు మాంసపు ముద్దలా మారిపో యాయి. ప్రమాద సమాచారం అందుకున్న సిఐ రాజశేఖర్, కట్టంగూర్ ఎస్సై ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం నకిరేకల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రమా దంలో తీవ్రంగా గాయపడిన ప్రశాంత్ ను చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు . ప్రమాదానికి కారణమైన వాహనాన్ని గుర్తించేందుకు పోలీసులు ప్రయత్నిస్తున్నారు. ఈమెరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై దగ్గుల క్రాంతి తెలిపారు.

